కథ

# మనసున దాగిన మమత

- వలివేటి నాగచంద్రావతి

చీకట్లు విడిపోతూ తెలతెలవారుతోన్న వేళ... "వసంతా... అమ్మాయ్ వసంతా" లేని ఓపికని కూడేసుకుని సాధ్యమైనంత వాయి పెంచి పిలుస్తోంది వరమ్మ... పూర్వాశ్రమంలో వరలక్ష్మి.

నడుం మీదున్న మగని చేయి పక్కకి తోసి విసుక్కుంటూ లేచి వచ్చింది వసంత నిద్రమంచం మీంచి.

"ఏం కొంప మునిగింది... అర్ధరాత్రి గొంతు చించుకుంటున్నారు?" బహువచనం మినహా అత్తగార్ని ఏ రకంగానూ మన్నించటం ఎప్పుడో మానేసింది వసంత.

"తెల్లవారొస్తున్నట్టుందే వసంతా, కాకులరుస్తున్నయ్. ఇంకా ఆలస్యమయితే సమయానికి పని తెమలలేదని హడావుడి పడతావనీ..." బెరుగ్గా అంది ముసలావిడ.

అప్పుడు చూసింది గడియారం వంక... అయిదు దాటిపోయింది. నీళ్లు చల్లినట్టు కోపమైతే ఉపశమించిందిగానీ మాటలో విసురు తగ్గలా. "ఊఊ, అన్నీ మీకే కావాలి. మీరు చెప్తేగానీ తెలియదా నాకు..." కుచ్చిళ్ళు బొడ్డున దోపుకుంటూ వచ్చేసిందివతలకి.

వెళ్తా అనుకుంది లోలోపల - 'వెదవది బాగా నిద్రపట్టేసింది. ఈవిడగానీ లేపుండకపోతే చచ్చుండేదాన్ని' అని.


ఇక నేరుగా పనిలోకి దిగిపోయింది వసంత.

కాలం ముందుకు వెళ్ళిపోయి ఎన్నెన్ని వసతులు అమరితేనేమి... ఇల్లాలి శ్రమ తగ్గినవారా పని రెట్టింపవుతూనే ఉంది.

మోగే అలారం మీద ఓ మొట్టుమొట్టి - మొహం మీద దిండేసుకుని మరీ కళ్ళు విప్పడానికి మొరాయించే పిల్లల్ని తట్టితట్టి లేచేదాకా పోరాడే ఏ మెషీన్ లేపుతుంది?

ఏ పనిముట్టూ చేయలేని పనులు ఎన్నుంటాయని? పిల్లలకి బ్రష్షుల మీద పేస్టు కూడా వేసి పెట్టాలి. గీజర్ ఆన్ చేయాలి. పాలు కాచాలి. భర్తకి కాఫీతోపాటు పేపరందించాలి. బాత్‌రూమ్ తలుపు మీద టవలు వేసి స్నానానికి వెళ్ళమని ఒక్కొక్కళ్ళనీ తోసి పంపించాలి. ఈలోగా పనిమనిషికి అంట్లు పడేసి ఆవిడగారికి కావాల్సిన స్క్రాచ్ బ్రైట్లూ, విమ్ బార్లూ, సబీన పౌడర్లూ అందించాలి. వంటకి సిద్ధం చేసుకోవాలి... ఈ పనన్నీ ఏ యంత్రం చేస్తుంది?

ఈ కామాలేని పనుల మధ్యన 'అమ్మాయ్, వసంతా' అంటూ అత్తగారి పిలుపొకటి.



విసుగొచ్చిందంటే, రాదూ మరీ... కానీ తప్పదు.

వెళ్ళింది వసంత అత్తగారి గదిలోకి

"నోరు చిరాగ్గా ఉందే!" నిస్సహాయంగా అంది ముసలామె.

కాలకృత్యాలకోసరం ఆవిడ్ని బాత్‌రూమ్ దాకా - చెయ్యి సాయమిచ్చి నడిపించాలి. నిప్పుల మీద నించున్నట్టు, ఆ పది నిమిషాలూ అక్కడ నిలుచుని ఆవిడ్ని మళ్ళీ మంచం మీదకి చేర్చి ఇవతల పడింది వసంత. మళ్ళీ ఉరుకులూ పరుగులూ మొదలు.

బ్రేక్‌ఫాస్ట్ టైమ్. ఆ మాటెత్తాలంటే భయం వసంతకి - కొడుక్కి ఇడ్లీ వద్దు. అమ్మాయికి జీడిపప్పు ఎక్కువేసిన ఉప్మా కావాలి. ఆయనగారికేమో నూనె తక్కువేసినదేదయినా సరే - ఎవరి ఇష్టం వాళ్ళదే - రాజీపడరో పట్టాన. అలకలూ మొండితనాలూ బెదిరింపులూ... వీటితో బోలెడు సమయం వేస్టయిపోతుంది.

ఒకళ్ళని బతిమాలీ, ఒకళ్ళని కోప్పడీ, ఇంకొకళ్ళకి సర్దిచెప్పీ... మరీ మంకుతనం చేస్తే వాళ్ళు కోరిందే చేసిపెట్టీ, మొత్తానికి టిఫిన్ల కార్యక్రమం పూర్తయిందనిపించేసరికి తాతలు దిగివస్తారు. ఎవరి బాక్సులు వాళ్ళకి సర్ది పెట్టడమింకో పర్వం. అది పూర్తయితే ఇక ఆఫీసులకీ కాలేజీలకీ వెళ్ళే హడావుడి.

వసంతకి అసలైన టెన్షన్ టైమ్ అదే.

సరిగ్గా బయలుదేరటానికి కాస్త ముందు మొదలవుతుంది- స్టేషనొచ్చేముందర బండి దిగాల్సిన ప్రయాణీకులు కంగారుపడతారే అట్లా కాళ్ళు తొక్కుకుంటారందరూ.

సీనియరింటరు వెలిగిస్తున్న సుపుత్రుడు ఆదిత్య. అప్పటివరకూ సెల్ వదలకుండా ఆరామ్‌గా మిత్రులతో కబుర్లాడి అప్పుడు మొదలెడతాడు వెతకటం. 'నా సైన్స్ రికార్డు కనిపించట్లేదు... ఎవరు తీశారు?' అంటాడు. గదులన్నీ కెలికేసి అందరిమీదా కస్సుబుస్సులాడి ఇల్లంతా ఓ కొలిక్కి తెస్తుంటాడు.

వసంత భర్త ఆదిశేషు గొప్ప మతిమరుపు ప్రొఫెసరు. ఆయన వెంటవెంట ఉండి హెచ్చరిస్తూ ఉండకపోతే, లుంగీ మీదే షర్టు తొడిగేసుకుని, రెండు కాళ్ళకీ రెండురకాల సాక్సూ వేసుకుని హాయిగా బయటకు వెళ్ళిపోగల పరధ్యానం మనిషి.

ఇక కూతురు అరవింద- చెప్పుల్లో కాళ్ళు పెట్టి మరీ అరుస్తుంది. 'అమ్మా, అమ్మా... నా చున్నీ చిరిగిందే, చప్పున కుట్టివ్వవ్... ప్లీజ్ ప్లీజ్' అని.

మొత్తానికి అవసరాలన్నీ తీర్చి అందర్నీ పంపించింది వసంత. వీధి తలుపు గడియపెట్టి ఉస్సూరంటూ వెనక్కి తిరిగింది. ఇందాక తాగుతూ తాగుతూ వదిలేసింది - సగం కాఫీ - డైనింగ్ టేబుల్ మీద. కప్పులో కాఫీ గిన్నెలో పోసి తిరిగి వెచ్చబెట్టుకోబోతూ గతుక్కుమంది. 'పెద్దామెకి పాలన్నా ఇవ్వలా... అయ్యో అయ్యో, నా మతిమరుపు పాడుగానూ, సొమ్మసిల్లిపోయిందో ఏమో' కంగారుగా గిన్నెలో పాలు గ్లాసులోకి వంచుకుని పరిగెత్తుతున్నట్టే వెళ్ళింది అత్తగారున్న గదిలోకి వసంత.

నిజంగానే, నీరసానిగ్గావును... ముడుచుకు పడుకునుంది ముసలావిడ. జాలి లాంటిది రాబోయింది వసంతకు. దాన్ని పక్కకు నెట్టేస్తూ కోపం ముంచుకొచ్చింది.

"ఏం, ఉత్త పుణ్యానికి 'వసంతా వసంతా' అని ఎప్పుడూ గీపెడుతూ ఉంటారుగా. పాలిమ్మని ఒక్క మాటడగటానికి గొంతు పోయిందా?" మండిపడింది వసంత.

"అది కాదే, పనుల మధ్యలో పిలిచి విసిగించటమెందుకనీ..." గొణిగింది వరమ్మ.

"ఉద్ధరించారు. ఏ శోషో వచ్చి పడిపోతే మళ్ళీ నేనేగా నెత్తి మొత్తుకుంటూ సేవలు

చేసి తగలబడాల్సింది" ఆవిడ కూర్చోటానికి సాయం చేసి గ్లాసు చేతికందిస్తూ అంది వసంత- నేరమారోపిస్తున్నట్టుగా.

గ్లాసులో పాలు ఒక్క గుటక వేసింది వరమ్మ "నువ్వు కాఫీ అన్నా పూర్తిగా తాగావటే?" అంది కోడలి మొహంలోని అలసట గుర్తించినట్టు.

ఆ మాటలోని వాత్సల్యం ఒక్క క్షణం గుండెని కదిలించినా గుర్తించనట్టుగా మొహం పక్కకు పెట్టి "తాగక ఛస్తానా... అయినా ప్రతిదీ ఆరా తియ్యొద్దని మీకు ఎన్నిసార్లు చెప్పాను? ఊఁ, తాగండి తాగండి, నాకవతల బోలెడు పని తగలడింది" అంది వసంత విసుగ్గా.

గటగటా తాగేసే శక్తి లేదు వరమ్మకి. నాలుగేసి చుక్కలు చప్పరించినట్టుగా మింగుతుంది. కాస్త అసహనంగా, కాస్త 'పోన్లే పాపం' అన్నట్టుగా ఆ పది నిమిషాలూ బాధ్యతగా నిలబడుతుంటుంది వసంత.

"ఫలహారమేమిటి చేశావే?" కోడలి విదిలింపు గుర్తున్నా మాట్లాడకుండా ఉండలేదు వరమ్మ. ఇరవై నాలుగ్గంటలూ ఆ మంచాన్నంటి పెట్టుకునే ఉంటుందేమో- మనిషి కనబడితే చాలు వాపిరిగా ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటుంది పాపం.

"ఒక్క రకమా... చటుక్కున చెప్పటానికి? నా నెత్తిన నలుగురు బాసులు. ముగ్గురికీ మూడు అయిటమ్‌లు చేసి పెట్టాను. ఇదిగో మీకింకో వెరైటీ చేసిపెట్టాలిప్పుడు" అంది రవ్వంత విసురుగా.

నొచ్చుకున్నట్టూ, కించపడుతున్నట్టూ అంది వరమ్మ "వద్దులేవే, మళ్ళీ ఏమి అవస్థపడతావ్. ఉన్నదేదో పెట్టెయ్యి, తినేస్తాను."

"అవును పాపం, ఏది పడితే అదే తినేస్తారు. ఆ తరవాత నమల్లేక చెంపలు లాగేస్తున్నాయని గోలపెడతారు. వద్దమ్మా వద్దు... మీకా నొప్పీ వద్దు... నాకా నిందావద్దు" కాఫీగ్లాసు తీసుకువెళ్ళిపోతూ అంది వసంత.

★ ★ ★


గోధుమరవ్వ వేయించి గుజ్జనగూడులా వండి పళ్ళెంలో పెట్టుకుని అత్తగారి గదిలోకి వెళ్ళబోతోంది వసంత.

"వసంతగారూ!" పిలిచింది పక్కింటి మీనాక్షి మధ్యనున్న ప్రహరీగోడ మీదుగా.

"ఒక్క నిమిషం, అత్తయ్యగారికిది పెట్టేసి వస్తాను."

ఆవిడ పట్టుకుంటే వదలదని తెలుసు. ఈ లోపల పళ్ళెంలోది కాస్తా చల్లారిపోతుందనీ తెలుసు. "చల్లారిపోతే సయించక తినలేరావిడ" అంది వసంత ఆవిడ వంక చూస్తూ.

"అబ్బ, మీ అత్తగారి సుతారాలకే లోటా



రాదుగానీ ఒక్క మాట విని వెళ్ళండి" అంది మీనాక్షి చనువుగా మొహమాట పెడుతూ.

"చెప్పండి" ఆగింది వసంత.

"జింఖానా గ్రౌండులో చినజీయరుస్వామిగారు కిందటేడు చేస్తున్నట్టే మహాలక్ష్మీ యాగం చేస్తున్నారట. ఇవాళా, రేపే చివర్రోజులు. మధ్యాహ్నం వెళ్దాం, వస్తారా?" అడిగింది మీనాక్షి.

క్రితం ఏడాది వెళ్ళిందక్కడికి. ఎంత ఆనందమనిపించిందో! విపరీతమైన జనం... అందరి కళ్ళనూ నిమీలితం చేస్తున్న భక్తిభావం, తన్మయత్వం. పవిత్రమైన వస్తువులతో మరింత పవిత్రంగా అగుపడుతోన్న యజ్ఞవేదికా, పండితుల వేదఘోషా, పురోహితుల మంత్రోచ్చాటనా, వెల్లివిరిసే ఆధ్యాత్మిక శోభ!

అవన్నీ పరవశంగా వింటూ, చూస్తూ ఉంటే... ఆత్మతో సహా తనువంతా పునీతమైనట్టు గొప్ప అనుభూతి.

"రావాలనే ఉంది కానీ నాకెలా కుదురుతుంది చెప్పండీ? అత్తయ్య ఒంటరిగా ఉంటారు కదా" నిస్సహాయంగా నిట్టూర్చింది వసంత.

"మరీ చోద్యమండీ వసంతగారూ, ఏ కోడలికైనా అత్త లేకుండా ఉంటుందా - ఆ అత్త మంచమెక్కకుండా ఉంటుందా..? అందుకని ఎన్నాళ్ళని మీ సరదాలన్నీ చంపుకుని ఆవిడకి కాపలా ఉంటారు చెప్పండి" అంది మీనాక్షి 'విడ్డూరం సుమా' అన్న ధ్వని వినిపించేట్టు.

"మరేం చేయమంటారు... ఆదివారమన్నా కాదాయె- పిల్లల్నో, ఆయన్నో ఆవిణ్ణి చూసుకుంటూండమనటానికి" నిరాశగా అంది వసంత.

"నేనొకటి చెప్పనా" అని, వసంత 'చెప్పండి' అనే ఎడమీయకుండానే "మా ఇంటికొస్తుంటుందే- కల్పకం... నా స్నేహితురాలు- తన అత్తగారూ ఇలానే మంచం మీదే ఉంది రెండేళ్ళబట్టీ. తను మీలా ఇంటికే అంకితమయి పోయిందనుకున్నారా- ఊహూ- అత్తని ఇంట్లో పెట్టి, ఇంటికి తాళంపెట్టి హాయిగా షికార్లకీ, షాపింగులకీ తిరిగేస్తుంటుంది."

"అమ్మో!"

"ఏం- ఏమవుతుంది..? అన్నాననికాదుగానీ వసంతగారూ... మీరు మరీ అమాయకులండీ. ఏడాది నుంచీ హెచ్చూ తగ్గూ లేకుండా మంచంమీదే ఉంటున్న మనిషి, ఓ రెండు గంటలపాటు మీరు చూసుకోనంత మాత్రాన ప్రాణం మీదికి వచ్చేస్తుందంటారా- ఏం ఫరవాలేదుగానీ, నా మాట విని తయారవండీ" జబర్దస్తీగా అంది మీనాక్షి.

"చూస్తాను" అయోమయంగా తలూపింది వసంత.

★ ★ ★

ఆలోచనలో పడింది వసంత. అత్తగారికి టిఫిన్ తినిపిస్తూ కూడా ఆలోచనే- మీనాక్షి అలవోకగా సెలవిచ్చిన సలహా గురించి.

చప్పరిస్తున్నట్టుగా దవడలు ఆడిస్తూ తింటున్న అత్తగారిని సాలోచనగా చూసింది వసంత.

'పాపం అత్తగారు మంచిదే. తన్నంతగా ఎప్పుడూ ఆరడి పెట్టలేదు. ఎనభై ఏళ్ళు వచ్చినా ఆ మాయదారి పక్షవాతం వచ్చేవరకూ తిరుగుతూనే ఉండేది. చిన్నాచితకా పనులు చేసిపెట్టేది తనకి సాయంగా. తనెక్కడికి వెళ్ళినా వద్దనేది కాదు. వచ్చేదాకా ఇల్లు చూసుకునేది. మిగులూ తగులూ పనులుంటే పూర్తిచేసి పెట్టేది. ప్రాణమప్పుడు ఎంతో హాయిగా ఉండేది.

ఈవిడిట్లా మంచమెక్కడం కాదుగానీ తనే ఇంటికి కాపలా కుక్కయిపోయిందిప్పుడు.

"నువ్వు ఫలహారం చేశావుటే?" ప్రశ్నిస్తోంది వరమ్మ ఆప్యాయంగా.

"అబ్బబ్బ, మీకు అక్కర్లేంది లేదు బాబూ"


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాదారణ చేతి రాతలో ఏడు అర తావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

ఆదివారం అనుబంధం

ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,

హైదరాబాద్-82.

విసుక్కుంటూ లేచింది వసంత పళ్ళెం పట్టుకుని.

ఇక చిందరవందరగా ఉన్న ఇల్లు సర్దుతున్నంత సేపూ, మిగతా ఇంటిపనులు ముగిస్తున్నంత సేపూ గందరగోళంగా ఉన్న మనసులో 'వెళ్ళటమా మానటమా' అని గుబ్బిసలాడుతూనే ఉంది వసంత.

తీరా ప్రహరీమించి మీనాక్షి "వస్తున్నారా?" అని మరోసారి హెచ్చరించేసరికి చటుక్కున ఓ నిర్ణయానికి వచ్చేసింది. 'ఆవిడన్నట్లు జరిగిపోయిన రోజులు తిరిగొస్తాయా? ఎంతకాలమని ఓ సరదా, చట్టుబండలూ లేకుండా ఈ అత్త మహాతల్లి కోసం ఇంటిని వదలకుండా గబ్బిలంలాగా వేలాడుతుంది. మనిషి కాదూ తనుమ్మాత్రం!'

'వస్తున్నా!' అన్నట్టు తలూపేసింది వసంత.

తను భోంచేసేసింది. అత్తగారికీ తినిపించేసింది.

"నువ్వు అన్నం తిన్నావుటే?" పలకరించింది వరమ్మ ఆప్యాయంగా.

విసుక్కోలేదు వసంత "తిన్నాను" అంది ముభావంగా.

చకచకా మంచి చీర కట్టుకుంది. తలుపులన్నీ జాగ్రత్తగా బోల్టులు పెట్టింది. మంచంపక్క అత్తగారికి అందేలా మంచినీళ్ళ గ్లాసు పెట్టింది.

గదిలోంచి వచ్చేస్తూ గుమ్మం దాటేముందర వెనక్కి తిరిగి చూసింది మరోసారి. మాగన్నుగా కళ్ళు మూసుకు పడుకుంది వరమ్మ. మనసెందుకో కలుక్కుమంది వసంతకి. 'తను సాయంచేస్తేగానీ పక్కకి కూడా తిరగలేదావిడ. ఏదయినా అవసరమయితేనో- తను లేనప్పుడు.'

దారికడ్డంగా పడివున్న నిస్సహాయజీవిని కాలితో పక్కకి తోసి ముందుకు వెళ్ళిపోతున్నట్టు 'తప్పు చేస్తున్నావ్' అని చూపుడు వేలెత్తి ఎవరో తనని మందలిస్తున్నట్టు అపరాధ భావన.

ఒక్క క్షణం అలాగే నిలబడి వెనక్కి వచ్చేసింది వసంత. మంచి చీర విప్పి పడేసింది. మామూలు చీర చుట్టేసుకుంది. పెరటి తలుపు తీసి కనిపించిన మీనాక్షికి తను రావటంలేదని చెప్పేసింది. అదేమిటన్న ప్రశ్న ఆవిడడిగే సందీయకుండా తలుపు వేసేసింది. చేతుల్లో మొహం దాచుకుని చాలాసేపలానే కూర్చుండిపోయింది సోఫాలో.

సాయంత్రమయింది. ఆదిశేషు ఆఫీసు నుంచి వచ్చాడు. మంచం మీద కుప్పలా పడున్న సిల్క్‌చీర చూసి, "రాణిగారు ఏ విహారం చేసి వచ్చారేం?" అని మేలమాడాడు.

నిండుగా గాలి నింపిన బెలూన్‌ని గట్టిగా అదిమి బరస్ట్ చేసినట్టుగా గయ్యిమంది వసంత... "నా మొహానికి వినోదాలూ, విహారాలే తక్కువ" అంటూ.

కామ్ అయిపోయాడు ఆదిశేషు. నవ్వబోయిన పిల్లలు గప్‌చుప్‌గా ఉండిపోయారు. భార్య బుసబుసలకి కారణమేమిటీ అనిగానీ, దాన్ని తగ్గించటమెలాగా అనిగానీ అసలు ఆలోచించలేదు ఆదిశేషు. అతనికి తెలుసు వసంత కోపం తాటాకుమంట అని. అతననుకున్నట్టే ఇంకాసేపట్లోనే అలక ఛాయలు పోయేలా మొహం కడిగి తుడిచేసుకుని, ఇందాకటి తన రుసరుసలకి బిడియపడుతోన్నట్టుగా కాస్త తల వంచుకుని అందరికీ టీ చేసి తీసుకొచ్చింది వసంత.

★ ★ ★

నలుపును చెదరగొడుతూ తెల్లవారుతోన్న మరో ఉదయం...

తట్టిలేపినట్టు కళ్ళు తెరిచింది వరమ్మ. పరిచయం లేనివారెవరో తనని రారమ్మని తొందరపెడుతూ లాక్కువెడుతున్నట్టనిపించి,



"వసంతా" అని గట్టిగా పిలవబోయింది భయంగా. గొంతు పెగలలేదు. శక్తికొద్దీ లేవటానికి ప్రయత్నించి బలంగా తీసుకున్న ఊపిరిని చివరిసారి వదిలేస్తూ పక్కకి ఒరిగిపోయింది. మరి లేవలేదు వరమ్మ.

అలవాటుగా పనిమధ్యలో చెయ్యి వీలు చేసుకుని గదిలోకి వచ్చిన వసంతకి కట్టె అయి కనిపించింది అత్తగారు.

బాధా - విచారమా - లేకపోతే మోస్తున్న భారం నుంచి విముక్తి లభించిన సుఖానుభూతా? ఏమో- ఏదో చెప్పలేని భావం చుట్టేసింది క్షణం వసంతని. అంతలోనే తెప్పరిల్లుకుని "అత్తయ్యా" అంటూ కెవ్వున కేకవేసింది.

★ ★ ★

పండుటాకు రాలిపోయింది. ముసలి వగ్గు అయినాసరే 'మరణించింది' అనగానే ఎవరికైనా బాధ కలగటం సర్వసహజం. అయితే ఆ విచారంలో 'మిగల మగ్గినపండు తొడిమ నుంచి రాలకుండా ఉండదు గదా' అనే వైరాగ్యం కించిత్ కలుస్తుంది.

వరమ్మగారు పోయిందన్న వార్త తెలిసి ఇంటికి వచ్చిన బంధువులు అందరిదీ అదే ధోరణి. మిత్రులూ పరిచయస్తుల పరామర్శలలోనూ దాని స్పర్శ.

రక్త సంబంధీకులకు మాత్రం కళ్ళు తడిబారుతున్నాయి. వసంత నిర్లిప్తంగా ఉంది.

యథావిధిగా కర్మకాండ జరిగింది. పుణ్యావచనం, నారాయణ నామస్మరణతో పూరిబంతి, ఆశీర్వచనాలతో పదకొండవరోజు తతంగం సమాప్తమయింది.

దీపాలు పెట్టే వేళకు ఇంట్లో నలుగురు మాత్రమే మిగిలారు.

మర్నాడు ఎవరి పనుల్లో వాళ్ళు నిమగ్నమైపోయారు. మామూలు ప్రకారం ఆదిశేషు షేవ్ చేసుకోవడం మరచిపోయి స్నానం చేసేశాడు. వసంత హెచ్చరికతో ఆ పని పూర్తిచేసి మళ్ళీ స్నానం చేశాడు. మామూలుగానే 'నా ప్రాక్టికల్ నోట్స్ ఎవరు తీశా'రంటూ ఆదిత్య గంతులేశాడు. 'ఇవాళ్టికివాళే సబ్‌మిట్ చేయాలి. నా ఫిజిక్స్ నోట్స్‌లో డయాగ్రమ్ గీసిపెట్టవా, ప్లీజ్ ప్లీజ్... అమ్మా అమ్మా' అంటూ తల్లిని కదలనీకుండా వినతి పూర్వకంగానే ఘొరావ్ చేసింది అరవింద.

ఇంత హడావుడి నడుమనా వసంత మనసుని సన్నగా మెలిపెడుతోందే... ఏమిటది?

అందరినీ బయటకు పంపేశాక కకావికలమైపోయిన ఒక్కో గదీ సర్దుకుంటూ వస్తోంది వసంత. రెండు బెడ్‌రూమ్‌లూ సరిచేశాక మూడో పడగ్గదికి వచ్చింది. అత్తగారి మంచం ఉండేదక్కడ. దాన్నిప్పుడు ఎత్తి గోడకి పెట్టేశారు. దక్షిణం వైపున్న కిటికీ తలుపులు ఆవిడకు చలి వేస్తుందని ఎప్పుడూ వేసే ఉంచేవారు.

భారమైన మనసుతో ఆ తలుపుల్ని తెరిచింది వసంత. చల్లని ఓ గాలితెర మెల్లగా లోపలికురికింది. మృదువుగా చెంపల్నీ మెడనీ తాకింది. తాకిన ఆ స్పర్శ కంఠం విప్పి 'ఫలహారం చేశావుటే వసంతా' అంది.

అప్పుడర్థమయింది వసంతకి- అప్పటిదాకా తనని వేధించిన లోటు ఏమిటో!

'పదువ్వుగా ఆ ఇంట్లో అడుగుపెట్టిన దగ్గర్నుంచీ భర్తతోకంటే పిల్లలతోకంటే అత్తగారితో కలిసి ఉన్న సమయమే ఎక్కువ. చిరకాలంగా ఎంతో సన్నిహితంగా మసలిన మనిషి దూరమైపోతూ మిగిల్చిన వెలితి అది.'

అప్పటివరకూ కడుపులో దాక్కున్న గుబులు కరిగి తెరలుతెరలుగా పైకుబికి రాగా కింద కూలబడి చేతుల్లో మొహం దాచుకుని బావురుమంది వసంత. ★